

రేపు ఉద్యోగమేళా

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటురంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 19న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్, కీర్తన ఫైనాన్స్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల వారు సెక్యూరిటీ గార్డ్స్, క్యాషియర్, డ్రైవర్స్, ఎగ్జిక్యూటీవ్, టెక్నీషియన్, సేల్స్‌మేనేజర్, లోన్‌మేనేజర్ ఉద్యోగాల కోసం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంబీఏ, బీకాం, ఎంకాం, ఏదైనా డిగ్రీ, ఇంటర్మీడియెట్ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు.

పర్యవేక్షణ లోపం.. చిన్నారులకు శాపం!

- అంగన్‌వాడీలపై కొరవడిన పర్యవేక్షణ
- అస్తవ్యస్తంగా మారిన నిర్వహణ
- నీరుగారుతున్న పూర్వ ప్రాథమిక విద్య
- చిన్నారులకు అందని పౌష్టికాహారం



7

టీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి కొనసాగింపు

7

- రిజిస్ట్రార్ పదవి ముగింపుపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు
- ఎట్టకేలకు రిజిస్ట్రార్ కొనసాగింపుతో ఉత్కంఠకు తెర

ఎన్‌హెచ్ఏఐపై నిర్మించిన బాత్‌రూమ్‌లకు తాళాలు

7



- చలనం లేని ఎన్‌హెచ్ఏఐ అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- సౌకర్యాలు కల్పించాలంటున్న ప్రయాణికులు

సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులకు లబ్ధిచేకూర్చాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



బోధన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

బోధన్‌రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. మంగళవారం బోధన్ పట్టణంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికి తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్ వారికి పలు సూచనలు అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పొరపాట్లకు తావు లేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్ మొబైల్ యాప్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తయ్యేలా ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాత కాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వస్తే అలాంటి వారి వివరాలను కూడా పూర్తిస్థాయిలో సేకరించి సర్వే యాప్‌లో పొందుపర్చాలన్నారు. దరఖాస్తు దారుకు ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపాలిటీ పరిధిలోని వారు వార్డు అధికారిని, గ్రామంలో ఉండే వారు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ఎంపీడీవో బాలగంగాధర్, బోధన్ మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి..

కోటగిరి: అర్హుల ఎంపికలో అక్రమాలకు తావివ్వకుండా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశించారు. రుద్రూరు మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సర్వే చేసే సమయంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని, ఇంత వరకు ఎన్ని గృహాలు సర్వే చేశారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. యాప్ సరిగ్గా పని చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నారని పంచాయతీ కార్యదర్శి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి రూ.వంద కోట్లు విడుదల చేయాలి

- అసెంబ్లీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి రూ.వంద కోట్ల నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అసెంబ్లీలో డిమాండ్ చేశారు. ఇతర నియోజకవర్గాలకు నిధులను కేటాయిస్తూ నిజామాబాద్‌కు ఇవ్వడం లేదన్నారు. నియోజకవర్గం అభివృద్ధి నిధుల విషయంలోనూ పక్షపాతం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. కొడంగల్‌కు సీఎం వేల కోట్ల రూపాయలను తీసుకువెళ్తూ నిజామాబాద్‌ను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన రూ.10 కోట్లు కూడా ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా పక్కదారి పట్టించి దుర్వినియోగం చేసేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల నిధులు ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు.



భూముల కొనుగోళ్లపై నజర్!

- జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల కొనుగోళ్లపై యంత్రాంగం దృష్టి
- నేతలు, ఉద్యోగులు, వ్యాపారులు కొనుగోలు చేసిన భూముల పరిశీలన
- ఈ కొనుగోళ్లలో అసైన్డ్ భూముల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో భారీగా భూముల కొనుగోళ్లు, అసైన్డ్ భూములు చేతులు మారడంపై యంత్రాంగం నజర్ పెట్టింది. పెద్దల చేతుల్లోకి వెళ్లిన భూముల వివరాలను సేకరిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లావాదేవీలను పరిశీలిస్తోంది. అప్పటి నేతలు, కుటుంబాలు, బంధువులకు సంబంధించిన భూముల వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఎవరెవరు ఎన్ని భూములను కొనుగోలు చేశారో పరిశీలిస్తున్నారు. వాటిలో అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయో వివరాలను సేకరిస్తున్నారు. నిజామాబాద్ నగరం చుట్టూ భూముల వ్యవహారంతో పాటు బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీల పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్నారు. వీటిలో నేతల కనుసన్నల్లో జరిగిన వాటిని పరిశీలించడంతో పాటు ఎవరిచేతిల్లో ప్రస్తుతం ఉన్నాయో ఆ వివరాలను సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పరిశీలించి ఒక నివేదికను ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. 'ధరణి' అమలుకు ముందు, తర్వాత జరిగిన లావాదేవీలను పరిశీలిస్తున్నారు.

పట్టా భూములతో పాటు అసైన్డ్ భూముల కొనుగోళ్లు

జిల్లాలో గత కొన్నేళ్లుగా భూముల కొనుగోళ్లు అధికంగా జరుగుతున్నాయి. కరోనా వచ్చిన తర్వాత వ్యవసాయ భూముల కొనుగోళ్లు ఎక్కువగా జరిగాయి. వీటిలో పట్టా భూములతో పాటు అసైన్డ్ భూములను కూడా ఎక్కువ మంది కొనుగోలు చేశారు. ఉద్యోగులు, వ్యాపారులతో పాటు ఇతర వర్గాలు ఎక్కువగా ఈ భూములను కొంటున్నారు. ఇళ్ల స్థలాలకంటే ఎక్కువగా పెట్టుబడులు వ్యవసాయ భూముల పైనే పెట్టారు. జిల్లా వ్యాప్తంగా వీరు కొనుగోలు చేయడంతో వ్యవసాయ భూముల ధరలు కూడా భారీగా పెరిగాయి. వీరితో పాటు ప్రజాప్రతినిధులకు సంబంధించిన కుటుంబాల వారు కూడా ఎక్కువ మొత్తంలో ఈ భూములను కొన్నారు. ధరణి వచ్చిన తర్వాత అసైన్డ్ భూముల్లో కొన్నింటిని పట్టాలుగా మార్చుకున్నారు. వీరిలో ఉద్యోగులు, వ్యాపారులతో పాటు నేతల కుటుంబాల వారు కూడా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇవన్నీ జరిగాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వేల ఎకరాలు అసైన్డ్ భూములకు పట్టాలు వచ్చాయి. ఈ వ్యవహారంలో నేతలతో పాటు అధికారుల సహకారం ఉండటం వల్ల లక్షల రూపాయలు చేతులు మారాయి. కొంత మంది అధికారులు ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో డబ్బులను సంపాదించారు.

కోట్లకు పడగలెత్తిన అధికారులు

నిజామాబాద్ నగరం చుట్టూ ఉన్న అసైన్డ్ భూముల వ్యవహారంలో కొంత మంది అధికారులు కోట్లకు పడగలెత్తారు. ఈ వ్యవహారంలో నేతల సహకారం ఉండటం వల్ల ఇతర రంగాల్లో పెట్టుబడులను కూడా పెట్టడంతో పాటు తమ కుటుంబ సభ్యుల పేరిట వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అప్పటి నేతల సహకారం ఉండటం వల్ల నగరం చుట్టూ ఉన్న మండలాల పరిధిలో ఈ భూములు ఎక్కువగా రియల్ ఎస్టేట్ వెంచర్లతో పాటు ఫాంహౌజ్‌లుగా మారిపోయాయి.

భూముల క్రయవిక్రయాలపై దృష్టి

జిల్లాలో గత ప్రభుత్వ కాలంలో భూముల క్రయవిక్రయాలు ఎక్కువగా జరగడం, అసైన్డ్ భూములు కూడా పట్టాలుగా మారడంతో ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నిజామాబాద్ నగరం చుట్టూ కొనుగోలు చేసిన భూముల వివరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో కొన్న భూముల వివరాలను పరిశీలించడంతో పాటు నివేదిక ఇవ్వాలని కోరడంతో వివరాలను సేకరించినట్లు సమాచారం. నగరం చుట్టుపక్కల అప్పటి ప్రజాప్రతినిధులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులు, వైద్యులు కొనుగోలు చేసిన భూములపై నజర్ పెట్టినట్లు తెలిసింది. జిల్లాలో పదుల సంఖ్యలో ఎకరాలు కొన్న వారి వివరాలను రిజిస్ట్రేషన్ల ఆధారంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నేతలతో పాటు ఉద్యోగ సంఘాల నేతలు, వ్యాపారులు, వైద్యులు, ఉద్యోగులు కొంత మంది ఎక్కువ మొత్తంలో భూములపై పెట్టుబడులు పెట్టారు. కొన్ని గ్రామాల పరిధిలో 20 నుంచి 30 ఎకరాలకు పైగా కొనుగోలు చేశారు. ధరణి వచ్చిన తర్వాత అసైన్డ్ భూములకు సంబంధించి ఎక్కువగా చేతులు మారడం, పట్టాలుగా మారడం వల్ల సీసీఎల్ఏ నుంచి అందిన సమాచారం ప్రకారం ఈ వివరాలను తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉన్నట్లు కొందరు అధికారులు తెలిపారు. పట్టా భూములపై చర్యలు ఉండవని, ఒకవేళ అసైన్డ్ భూములు నిబంధనలకు విరుద్ధంగా పట్టాలుగా మారితే చర్యలు తీసుకుంటారని అధికారులు పేర్కొంటున్నారు.



పోలీసు కమిషనర్ నియామకం ఎప్పుడు?

- పోలీసు కమిషనర్ బదిలీ అయి రెండు నెలలు
- అనుకూలమైన అధికారి కోసం అధికార పార్టీ నేతల పట్టు
- కొరవడిన సమన్వయంతో ఆలస్యమవుతున్న నియామకం
- ఇష్టారాజ్యంగా కొంతమంది అధికారుల తీరు
- ఇన్‌చార్జి సీపీతోనే కొనసాగుతున్న పాలన

నిజామాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పోలీసు కమిషనర్ నియామకంపై రెండు నెలలుగా ఎటూ తేలడం లేదు. అధికార పార్టీ నేతల పట్టు, వారి మధ్య సమన్వయం లేకపోవడంతో కమిషనర్ పోస్టు భర్తీ కావడం లేదు. ఇన్‌చార్జి కమిషనర్‌తోనే రెండు నెలలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఐపీఎస్ నియామకం కోసం ప్రభుత్వం చొరవ చూపినా.. కొంత మంది నేతలు తమకు అనుకూలమైన అధికారులను నియమించాలని కోరడంతో ఆలస్యమవుతోంది. అదనపు డీసీపీని కూడా బదిలీ చేయడంతో జిల్లాలో పూర్తిస్థాయిలో పర్యవేక్షించే అధికారులే లేరు. మహారాష్ట్ర సరిహద్దులు కలిగి ఉన్న జిల్లాలో నేరాలు అదుపు చేసేందుకు పూర్తిస్థాయి అధికారిని నియమించాల్సి ఉన్నా.. ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

రెండు నెలల క్రితం సీపీ కల్మేశ్వర్ బదిలీ

నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కల్మేశ్వర్ సింగెనెవార్ రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. ఆయన కేంద్ర సర్వీసులకు వెళ్లారు. నేషనల్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేరారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు కొత్త కమిషనర్‌ను నియమించలేదు. కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు సబ్ డివిజన్‌లు ఉన్నాయి. ఏసీపీ స్థాయి అధికారులు సబ్ డివిజన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. జిల్లాస్థాయిలో ఇద్దరు అదనపు డీసీపీలు ఉండాల్సి ఉన్నా.. ప్రస్తుతం ఒక్కరే కొనసాగుతున్నారు. మరొకరిని 15రోజుల క్రితమే బదిలీ చేశారు. కమిషనరేట్ పరిధిలో పూర్తిస్థాయి అధికారులు ఉంటేనే లా అండ్ ఆర్డర్ సమర్థవంతంగా అమలవుతుంది. నేరాల నియంత్రణ కూడా కొనసాగుతుంది. రెండు నెలలుగా కమిషనర్ లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కొన్ని కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

అధికారులపై ఆరోపణలు

జిల్లాలోని కొంత మంది అధికారులపై కూడా ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, పేకాట, రియల్ ఎస్టేట్ రంగాలకు సంబంధించి ఎక్కువగా ఈ ఆరోపణలు కొనసాగుతున్నాయి. కొంత మందిని గత సీపీ నివేదిక ఆధారంగా బదిలీ చేసినా.. మరికొంత మంది అధికారులు తమకున్న పలుకుబడి వల్ల కొనసాగుతున్నారు. నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా కొంత మంది అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నా నేతల కనుసన్నల్లో మాత్రం కిందిస్థాయి అధికారులు పనిచేస్తున్నారు. తాము అనుకున్న పనులను కొనసాగిస్తున్నారు. కొన్ని విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లకుండానే పూర్తిచేస్తున్నారు.

అనుకూల అధికారి కోసం నేతల పట్టు

నిజామాబాద్ నగర పోలీసు కమిషనర్‌గా రెగ్యులర్ ఐపీఎస్ అధికారిని నియమించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపింది. యువ ఐపీఎస్‌లను నియమించేందుకు సిద్ధమైంది. బాసర జోన్ పరిధిలో కమిషనరేట్ కావడం పెద్ద జిల్లా కావడం వల్ల పదేళ్లకు పైగా అనుభవం ఉన్న అధికారిని నియమించేందుకు ఏర్పాట్లు చేసింది. జిల్లాకు చెందిన కొంత మంది నేతలు తమకు అనుకూలంగా ఉన్న అధికారులను నియమించాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. రెగ్యులర్ ఐపీఎస్ కన్న

మిగతా 8వ పేజీలో...



పరిశ్రమ ప్రారంభోత్సవానికి రావాలి

- ఎంపీతో కలిసి కేంద్ర మంత్రిని ఆహ్వానించిన పసుపు రైతులు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం పరిశ్రమ ప్రారంభోత్సవానికి రావాలని ఆ సంఘం రైతులు మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేను ఎంపీ అర్వింద్‌తో కలిసి ఆహ్వానించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో జేఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు పి.తిరుపతిరెడ్డి, రాజు, గడ్డం శ్రీనివాస్, నగేష్, లక్‌పతిరెడ్డి, రైతులు ఉన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

వేల్పూర్,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి అధికారులతో పచ్చల నడ్కుడ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి సమీక్షాసమావేశం నిర్వహించారు. మండలస్థాయిలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ఆయాశాఖల పని తీరుపై సమీక్ష నిర్వహించారు.ప్రజలకు అన్నిసందర్భాల్లో అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని అన్వేష్‌రెడ్డి అధికారులకు సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం చేయకుండా పనులు చేయాలని అధికారులకు సూచించారు.ఇందిరమ్మ ఇళ్లసర్వే తీరును ఎంపీడీవో బాలకిషన్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖలో జరుగుతున్న పనితీరుపై డీటీ మధును అడిగితెలుసుకున్నారు. అదే విధంగా వివిధ శాఖల ఏఈలతో, అధికారులతో వారి శాఖల పని తీరుపై సమీక్ష నిర్వహించారు. విధులు నిర్వహించడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈకార్యక్రమంలో వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, ఎంపీడీవో బాలకిషన్, డీటీ మధు, ఏపీఎం సాయిలు, ఈజీఎస్ ఏపీవో అశోక్, ఐకెపీ ఏపీఎం కిరణ్‌కు మార్, ఇతర శాఖల అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు టక్కరి గంగాధర్, మోహన్, నెహ్రూ, లింగేశ్వర్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

● ఉపాధ్యాయులకు పలు సూచనలు ● విద్యార్థులకు భోజనం వడ్డన



భోజనం వడ్డిస్తున్న డీఈవో



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఏర్గట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా పాఠశాలలోని తరగతి గదులు పరిశీలించి ఉపాధ్యాయుల విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకొని, రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలుసూచనలు తెలిపారు.అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించి ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మంచి భోజనం అందిస్తోందని విద్యార్థులు భోజనాన్ని వృధా చేయకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రవీణ్ శర్మ, మునీరుద్దీన్, ట్వింకిల్, సబిత, నరేష్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడిపై ఎలుగుబంటి దాడి

● గాయాలతో పరుగు పెట్టి.. ప్రాణాలు కాపాడుకున్న అశ్విత్



గాయపడిన అశ్విత్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు ఆఫీసర్లు

ఎడపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :ఎడపల్లి మండలం కుర్నాపల్లికి చెందిన అశ్విత్ అనే బాలుడిపై మంగళవారం ఎలుగుబంటి దాడి చేయడంతో.. స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కుర్నాపల్లికి చెందిన అశ్విత్ గ్రామంలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం కాలకృత్యాలకని గ్రామ శివారులోని చెరువు గట్టు వద్దకు వెళ్లాడు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఓ ఎలుగుబంటి బాలుడిపై దాడి చేసింది. దీంతో అశ్విత్ మోకాలి భాగంలో గాయాలయ్యాయి. బాలుడు భయంతో గట్టిగా అరిచి.. పరుగుల పెట్టడంతో ఎలుగుబంటి దాడి నుంచి తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు.ఇంటికొచ్చి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో.. వారు వెంటనే అశ్విత్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా.. సంఘటన జరిగిన స్థలాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంజయ్‌గౌడ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్‌లు పరిశీలించారు. ఎలుగుబంటి గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లిందన్నారు. అటవీ జంతువులు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన



దాస్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి):హోలిమేరీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళల ఆరోగ్యస్థితి సానిటరీ ప్యాడ్స్ సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్ కార్యదర్శి విజయ శారదరెడ్డి, డైరెక్టర్ కీర్తిరెడ్డిలు మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు వైద్యసిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తే మొదటి దశలోనే వాటిని నివారించవచ్చని వారన్నారు. అనంతరతం మండలంలోని మానిక్‌బండార్, దాస్‌నగర్, ముబారక్‌నగర్ గ్రామాల్లోని విద్యాసంస్థల బాలికలకు సానిటరీ ప్యాడ్స్ సర్వైకల్ క్యాన్సర్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందంతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌రూరల్,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీటీమ్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాలు, టీ సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జేజే చట్టం, సైబర్ నేరాల గురించి విద్యార్థులు అవగాహన కలిగిఉండాలన్నారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, షీటీమ్ సిబ్బంది విజయ, సుజాత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్

కమ్మర్‌పల్లి, డిసెంబరు 17:(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు దీటుగా పనిచేస్తున్నాయి ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అన్నిరకాల సదుపాలయాలను కల్పిస్తూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన చేయిస్తున్నారు. విద్యార్థులు సదుపాయాలు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్యనభ్యసించాలని కమ్మపల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

రెంజల్,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఎంపీడీవో వెంకటేష్, సూపరిండెంట్ శ్రీనివాస్ అంగన్‌వాడీ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.మంగళవారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అంతటా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు



బోధన్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బాన్సువాడ అంబేద్కర్ చౌరస్తాలో..

బోధన్‌రూరల్,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులకు ప్రభుత్వం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పి రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద, ఆచన్‌పల్లి కమాన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ లగచర్లలో రైతులను అరెస్టు చేయడం శోచనీయమన్నారు. ఆరోగ్యం బాగా లేని రైతు చేతికి బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం బాధకరమన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన కొనసాగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మైనారిటీ నాయకులు రజాక్, భవానీపేట్ శ్రీనివాస్, కౌన్సిలర్ బెంజరి గంగారాం, శంకర్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గౌతం ప్రసాద్, సుబాష్, కళ్యాణ్, స్వరూప,శారద, రాము, కిషోర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: లగచర్ల రైతుల భూములను లాక్కోవ డానికి అన్యాయంగా అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జక్రాన్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోజన్న, మాజీఎంపీపీలు దీకొండ హరిత శ్రీనివాస్, కుంచాల విమల రాజు, మాజీసర్పంచ్‌లు దేవరాజ్, మాజీఎంపీటీసీలు పోతె రాజు, మరియా సతీష్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు అప్పాల అరుణ్‌కుమార్, ప్రేమ్, సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: లగచర్ల రైతులను అక్రమంగా అరెస్టు చేసి జైలులో నిర్బంధించడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, అల్లం రమేష్, గైని సతీష్, స్వామి, సాయిబాబా, గంగన్న, ఒడ్డె రవి, కళ్యాణ్, ఫకీరా, నరహరి తదితరులున్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం బాల్కొండ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రైతులపై జరుగుతున్న అరాచకాలు, అణచివేతలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరాచకాల నుంచి లగచర్ల రైతులను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అడుగడుగున రాజ్యాంగాన్ని కాలరాస్తుందని, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను అవలంబిస్తుందని ఆరోపించారు.లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి వారిని జైల్లో నిర్బంధించి హింసిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమ కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన బీఆర్ఎస్‌నాయకులు పాల్గొన్నారు.

దోమకొండ: లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తి వేయాలని మంగళవారం దోమకొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యంపేట విండో చైర్మన్ తిరుపతిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కుంచాల శేఖర్ మాట్లాడుతూ రైతులపై అక్రమంగా పెట్టిన కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించడం సమంజసం కాదన్నారు. రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత, విధానాలకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశామన్నారు. రైతుల కుటుంబాలను వేధించడం, హింసించడం ఆపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, నాగరాజు, కూర చంద్రం, సునీత, నాగరాజ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజిరెడ్డి, శ్రీనివాస్, పెంటాగౌడ్, మహేశ్, ఎస్‌పాల్, నవీన్, విజయ్, సంజీవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజు, బాల్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: బీఆర్ఎస్ పార్టీ ఆదేశ అనుసారం మండల టీఆర్ఎస్ నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టారు. లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని వారు తెలిపారు. ఈ కార్య క్రమంలో సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, మాజీ మండల అధ్యక్షుడు నల్లవెల్లి రవి, మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కామారెడ్డిటౌన్:సీఎం సొంత నియోజకవర్గంలోని లగచర్ల గ్రామంలోని రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తు పట్టణ బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైలులో నిర్బంధించడం సిగ్గుచేటని అన్నారు. రైతుల చేతుల బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వనిరంకుశ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే తగిన విధంగా బుద్దిచెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికారప్రతినిధి గైనిశ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్‌యువజనవిభాగం అధ్యక్షుడు భానుప్రసాద్,నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ, కృష్ణాజీరావు,మల్లేష్‌యాదవ్, సంగీమోహన్,కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా ఎక్స్‌రోడ్డులో,ఘన్‌పూర్ గ్రామం వద్ద గల అంబేద్కర్ విగ్రహాలకు రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలని బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ రైతులకు బేడీలు వేసి చేస్తున్న నిరంకుశపాలన సరైంది కాదని వెంటనేరైతులను విడుదలచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజినాయక్, నర్సింలు, రమేష్,మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్,సుదర్శన్ గౌడ్,అబ్దుల్‌ఖాన్,హేమ్లానాయక్, శ్రీశైలం,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లరైతులు దళితులు పేద ప్రజలపై అక్రమంగా కేసులు నమోదుచేయడానికి వ్యతిరేకిస్తు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అంబేద్కర్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లగచర్లలో ఫార్మావిలేజ్ అని మరోసారి ఇండస్ట్రియల్ కారిడార్ మాయమాటలు చెబుతూ పేదల భూములు లాక్కునేందుకు కుట్రకుపునుకోవడంపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగున రాజ్యాంగాన్ని కాలరాస్తు అమాయక పేద ప్రజలను భయాందోళనకు గురిచేయడం సిగ్గుచేటని ఇష్టం వచ్చినట్లు పరిపాలించేందుకు రాజుల కాలం కాదని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వెంకట్రావుదేశాయ్,రాంచందర్, నల్చర్‌రాజు, మాజీ వైస్ ఎంపీపీ రాజుపటేల్, మల్లికార్జున్‌పటేల్, బోమ్మల లక్ష్మన్ పాల్గొన్నారు.

బాన్సువాడ: లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ కాంస్య విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అవమానవీయ, అణిచివేత విధానాలకు నిదర్శనమని బాన్సువాడ బిఆర్ఎస్ నాయకులు మోచి గణేష్ మండిపడ్డారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని, రైతన్నల కుటుంబాలను వేధించడం, హింసించడం ఆపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో..



తాడ్వాయిలో..



మోర్తాడ్‌లో..



మాచారెడ్డిలో..



బిచ్కుందలో..

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు

నవీపేట,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు ఛలో హైదరాబాద్ చేపట్టిన పంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కారోబార్లు, పంచాయతీ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మిన్ను కుమార్, గంగారాం, రవి, నర్సింలు, రంజిత్, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులున్నారు.

కోటగిరి: రుద్రూరు మండలంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు వెళ్తున్న సిబ్బందిని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిర్వహించే ధర్నాను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుని అరెస్టులు చేయించడం బాధకరమని పంచాయతీ సిబ్బంది వాపోయారు.

కమ్మర్‌పల్లి: తమ సమస్యల పరిష్కాం కోరుతు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్ తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న కమ్మర్‌పల్లి మండల పంచాయతీ కార్మికులు, కారోబార్లను కమ్మర్‌పల్లి పోలీసులు బుధవారం తెల్లవారుజామున ముందస్తు అరెస్టుచేశారు. మండల కారోబార్‌ల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, హసాకొత్తూర్ కారోబార్ వెంకటరమణ, కోనాసముందర్ కారోబార్ మోహన్ అమీర్‌నగర్ కారోబార్ నరేష్‌లకు బుధవారం తెల్లవారుజామున 5గంటలకు స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం సొంత పూచీ కత్తుపై విడుదలచేసినట్లు తెలిపారు.



మోర్తాడ్‌లో కారోబార్‌లను అరెస్టు చేసిన పోలీసులు

మోర్తాడ్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కారోబార్‌లను అరెస్టు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో పంచాయతీ కారోబార్‌లు, సిబ్బంది ఇందిరా పార్కులో ధర్నా కార్యక్రమం ఉండడంతో ముందస్తు వీరిని అరెస్టు చేశారు.అరెస్టు అయిన వారిలో తిమ్మాపూర్‌కు చెందిన సుదర్శన్, శెట్‌పల్లి పృధ్వీరాజ్, మోర్తాడ్‌కు చెందిన లక్ష్మణ్, ధర్మోరాకు చెందిన సాయన్న, పాలెంకు చెందిన శ్రీనివాస్‌గౌడ్, సుంకెట్‌కు చెందిన రాజేందర్‌లతో పాటు కారోబార్‌ల సంఘం జిల్లా నాయకురాలు సత్తెక్కను అరెస్టుచేశారు.ఉదయం 6గంటలకు తీసుకున్న అదుపులోకి తీసుకున్న పోలీసులు సాయంత్రం వదిలేశారు.

ఇందిరమ్మ సర్వే పరిశీలన



ఆర్మూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 12, 30, 31వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులకు సరైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్‌లు శేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, వార్డు ఆఫీసర్‌లు, సర్వేయర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

కమ్మర్‌పల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో ప్రభుత్వం సరఫరాచేసిన దుప్పట్లను మండల విద్యాధికారి నేర ఆంద్రయ్య బుధవారం విద్యార్థినిలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, అకౌంటెంట్ మంజుల పాల్గొన్నారు.

చలిమంట అంటుకుని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

● చికిత్స పొందుతూ మృతి

నవీపేట,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచకు చెందిన రొడ్డు పోసాని(63)అనే వృద్ధురాలికి చలిమంట అంటుకుని తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిందని ఎస్సై వినయ్ తెలిపారు. గ్రామంలో పోసాని ఒంటరిగా తన రేకుల షెడ్డులో నివసిస్తోందని ఈ నెల 13న రాత్రి సుమారు 7గంటల సమయంలో తన ఇంట్లో చలిమంట కాచుకోగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుందని తీవ్రంగా గాయపడిన ఆమెను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. 60శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందిందని, మృతురాలి సోదరి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ అరెస్టు.. రిమాండ్

బోధన్‌రూరల్,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్‌ను దొంగతనం చేస్తూ నిత్యం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగను మంగళవారం సాయంత్రం బోధన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం బాబా గార్డెన్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఒక మోటారు సైకిల్‌పై ఒక బస్తాతో బాబా గార్డెన్ వైపు వస్తుండగా అట్టి వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా సీసీఎస్ సిబ్బంది పట్టుకుని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారిని విచారించగా వారు సయ్యద్ మహ్మద్, సయ్యద్ అఫ్సర్ ఇద్దరు స్నేహితులని, వీరితో పాటు అన్సర్ ఖాన్, షేక్ తాహెర్, మహ్మద్ ఇమ్రాన్, షేక్.అప్సర్, మహ్మద్‌లు కలిసి అయన్ యొక్క ఆటోలో మోటార్ సైకిల్‌పై రాత్రి సమయాల్లో నిజామాబాద్ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలలో రాత్రి సమయాల్లో తిరుగుతూ రోడ్డు పక్కన పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి, వైరును తొలగించి అమ్ముకునే వారన్నారు. అట్టి డబ్బులను వారందరు పంచుకుని అవసరాలకు వాడుకునే వారన్నారు. దొంగతనాలు చేస్తూ 17-11-2024రోజున వారి స్నేహితులైన అన్సర్ ఖాన్, షేక్ తాహెర్, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ అయన్ అందరు కలిసి అయన్ యొక్క ఆటోలో ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగతనం చేయడానికి రాత్రి సమయంలో మాక్లూర్ మండలంలోని చిక్లీ గ్రామ శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి వెళ్లారని, అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ యొక్క కరెంట్ వైర్లను అయన్ అనే వ్యక్తి దొంగలిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అయన్ అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు. అట్టి కేసులో హుస్సేన్ ఖాన్, తాహెర్ మరికొంత మందిపై కేసు నమోదు అయిన అట్టి కేసులో అన్సర్, తాహెర్‌లు అరెస్టు అయి ప్రస్తుతం జైల్లో ఉన్నారని బోధన్‌లోని శ్రీనివాస్ నగర్‌లో దొంగతనం చేసిన రాగి వైర్లు అమ్మడానికి మంగళవారం తీసుకెళ్తుండగా వారిని పోలీసు సిబ్బంది వెంబడించి పట్టుకుని ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల దగ్గర 18కిలోల రాగిని, ఒక మోటార్ సైకిల్, రెండు పానాలు, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇట్టి వ్యక్తులు నిజామాబాద్ జిల్లాలోని బోధన్, బోధన్ మండలం, రుద్రూరు, కోటగిరి, వర్ని, ఎడపల్లి, రెంజల్, నవీపేట, నందిపేట్, నిజామాబాద్ రూరల్ పరిధిలో మొత్తం 28కేసులను చేధించిన సీసీఎస్ సిబ్బంది, సీఐ సురేష్, రవీందర్, గిరి, రాజేంద్ర ప్రసాద్, బోధన్ సీఐ, సిబ్బంది శ్రీకాంత్‌లను సీపీ అభినందించారు.



ట్రాన్స్‌ఫార్మర్ దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇసుక టిప్పర్ పట్టివేత

కోటగిరి,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి):పోతంగల్ మండలంలోని కొల్లూరు గ్రామ సమీపంలో మంగళవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పట్టుకున్న టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.సంబంధిత యాజమానిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయనపేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమరవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నెట్‌బాల్ పోటీల్లో రెంజల్ విద్యార్థి సత్తా

రెంజల్,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న వైష్ణవి ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ క్రీడాలలో మూడో స్థానం కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్ తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో నిజామాబాద్ జిల్లా తరపున నెట్‌బాల్ టీంకు కెప్టెన్‌గా వ్యవహరించి సత్తాచాటించిందని తెలిపారు. విద్యార్థినికి ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.విద్యార్థినులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఈడీ ప్రవీణ్, ఉపాధ్యాయులు పురుషోత్తం, ప్రతాప్, రాజేందర్, గంగాధర్, సురేష్, సలవుద్దీన్, రాధ, స్వప్న, ఇంతియాజ్, జిబిరియా, కృష్ణ, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎం కప్ పోటీల్లో పాల్గొనే సాఫ్ట్‌బాల్, బెస్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ప్రధానకార్యదర్శి గంగామోహన్, జిల్లా బెస్‌బాల్ సంఘ ప్రధానకార్యదర్శి వినోద్‌లు తెలిపారు. బెస్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18వ తేదీ నుంచి గచ్చిబౌలి స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా మహిళల, పురుషుల జట్టు ఈనెల 28వ తేదీ నుంచి మెదక్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కంటి సుజాత, నవీన్, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, కోచ్‌లు నరేష్, సంజీవ్, మౌనిక, అనికేత్, రమేష్‌లు పాల్గొన్నారు.

నర్సరీ పనుల ప్రారంభం

ముప్కాల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సరీ పనులను పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ సంవత్సరం గ్రామంలో నర్సరీ మొక్కలు పంపకం చేసి వర్షాకాలం ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం మొదలుపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రవీంధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్‌గౌడ్, మోహీనోద్దిన్, యుసుఫ్, సయ్యద్, మజారుద్దిన్, మహమ్మద్ అన్వర్, సయ్యద్, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ప్లాస్టిక్‌పై తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు షాప్‌లలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజుల ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించారు. పలు షాప్‌లలో ప్లాస్టిక్ నిర్వహించి జరిమానాలు విధించారు. సింగిల్ ప్లాస్టిక్ వాడకూడదని, లేకుంటే భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. తక్కువ మోతాదు గల ప్లాస్టిక్‌ను వాడిన పలు షాప్‌లకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, సిబ్బంది సంతోష్, అంజు, రవి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 17:(ఆంధ్రజ్యోతి)మండలంలోని ఉప్లూర్ గ్రామ శివారుల్లోని రుషికొండపై కొలువుదీరిన అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మూలవిరాట్ అయ్యప్పస్వామికి మహాబలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా నిర్వమిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శర్మహిందూధర్మ ఛానల్ ఆస్థాన పండితుడు బ్రహ్మశ్రీ కొడగండ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణం, అయ్యప్పస్వామికి లక్షపుష్పారన్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి చక్రస్నానం, ఉత్సవమూర్తుల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో అయ్యప్ప సేవాసమితి సభ్యులు అయ్యప్ప భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లి శివారులో ఎన్‌హెచ్ఏఐ రహదారిపై నిర్మించిన బాత్‌రూమ్‌లో బస్టాండ్ ఇదే..

ఎన్‌హెచ్ఏఐ రహదారిపై నిర్మించిన
బాత్‌రూమ్‌లకు తాళాలు

● చలనం లేని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ● ఇబ్బందుల్లో వాహనదారులు



బాత్ రూమ్‌లకు తాళం వేసి ఉన్న దృశ్యం

నిజాంసాగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ఏఐ రహదారిపై ప్రజా అవసరాల కోసం నిర్మించిన బాత్‌రూమ్‌లకు తాళాలు వేశారు. దీంతో రహదారి గుండా ప్రయణిస్తున్న ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్‌హెచ్ఏఐ రహదారి 161వ రహదారి కాగా, నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి శివారులోని రహదారిపై ఇరువైపులా ఎన్‌హెచ్ఏఐ అధికారయంత్రాంగం 2017 సంవత్సరంలో రహదారి నిర్మాణం దశలోనే రోడ్డుకు ఇరువైపులా బాత్‌రూమ్‌లను నిర్మించారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు కొన్నాళ్ల పాటు బాత్‌రూమ్‌లను వినియోగించుకునేందుకు నీటి వస తిని కల్పించి వదిలేశారు. సరైన నిర్వహణ లేక బాత్‌రూమ్‌లకు అధికార యంత్రాంగం తాళాలు వేశారు. దీంతో రహదారి వెంట రాకపోకలు సాగించే ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ రహదారి పక్కనే నిర్మించిన బాత్‌రూమ్ బస్టాండ్‌లో తాగునీటి వసతిని కల్పించలేదు. పేరుకు వాటర్ ట్యాంకులను బస్టాండ్‌లో ఉంచినా నీరు మాత్రం లేకపోవడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి 161వ జాతీయ రహదారిపై నిర్మాణం చేపట్టిన బాత్‌రూమ్‌లకు తాళాలు తీయించి నీటి వసతిని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎన్‌హెచ్ఏఐ 161 రహదారి ఇదే..

● అంగన్‌వాడీలను పర్యవేక్షించే వారేరి ?
● అస్తవ్యస్తంగా మారిన అంగన్‌వాడీల నిర్వహణ
● నీరుగారుతున్న ప్రాథమిక విద్య
● ఉన్నతాధికారులు చర్యలు చేపడితే మేలు



పర్యవేక్షణ లోపం..
చిన్నారులకు శాపం!

ఎడపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలో అంగన్‌వాడీకేంద్రాల నిర్వహణ గాడి తప్పుతోంది. కేంద్రాలను సక్రమంగా నిర్వహించాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను సరిగ్గా బోధించడం లేదన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఈ కేంద్రాల ద్వారా 3 నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వప్రాథమిక విద్యను అందించాల్సి ఉంటుంది. చిన్నారుల్లో బోధన సామర్థ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన టీచర్లు ఈ దిశగా కృషి చేయడంలేదు. కేవలం భోజనం, గుడ్డు అందించి బోధనను విస్మరిస్తున్నారు. ఫలితంగా మొదటి తరగతి వెళ్లాక తిరిగి పూర్వ ప్రాథమిక విద్యను బోధించాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. చిన్నారుల్లో బోధన సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రీస్కూల్ విధానాన్ని సైతం అమలు చేస్తున్నా ఆచరణలో మాత్రం అంగన్‌వాడీ కేంద్రాల్లో మచ్చుకైనా కనిపించడంలేదు.

● ప్రీ స్కూల్‌పై నిర్లక్ష్యం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ పట్ల టీచర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న వాదనలు చిన్నారుల తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి. బేసిక్ విద్యను నేర్పాల్సిన టీచర్లు కేంద్రానికి రాగానే స్మార్ట్ ఫోన్‌లలో నిమగ్నమవుతున్నారు. ఆయాలతో గుడ్డు పెట్టించడం, భోజనం చేయించడం ఆ తర్వాత చిన్నారులను పడుకోబెట్టడం చేస్తున్నారు. సాయంత్రం కాగానే తిరిగి పిల్లలను ఇంటిబాట పట్టిస్తున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఇదే దినచర్య కొనసాగుతుందంటే చిన్నారుల ప్రీస్కూల్‌పై టీచర్లు ఎంతటి చిత్తశుద్ధితో పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. చిన్నారులకు పౌష్టిక ఆహారంతోపాటు ప్రీస్కూల్ విద్యను అందించేందుకు ప్రతీనెల కోట్లాది రూపాయలను ఖర్చుచేస్తున్నా ఫలితం మాత్రం శూన్యమని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

● పర్యవేక్షణ లోపం..

మండలంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో ఏదో ఒక సెంటర్‌ను మండల సూపర్ వైజర్ పర్యవేక్షించాలన్నాది నిబంధన. చివరికి ఈ నిబంధనను సైతం తుంగలో తొక్కుతున్నారు. నిత్యం ఏదో ఒక సెంటర్‌ను మండల సూపర్ వైజర్ పర్యవేక్షిస్తే కేంద్రాల నిర్వహణ సక్రమంగా కొనసాగే వీలుంటుంది. కానీ ప్రతీరోజు కేంద్రాలను సందర్శిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. సీడీపీఓ సైతం నెలకు ఒకసారైనా మండలంలో పర్యటించి కేంద్రాలను తనిఖీ చేయడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల పర్యవేక్షణ లోపం కేంద్రాల్లోని చిన్నారుల పాలిట శాపంగా మారుతుంది. కేంద్రాలను తనిఖీ చేస్తే ప్రీస్కూల్ విధానం మెరుగుపడే ఆస్కారం ఉంది. ఉన్నతాధికారులు అంగన్‌వాడీ కేంద్రాలలో గాడి తప్పుతున్న ప్రీస్కూల్ విద్యా విధానాన్ని మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ఇష్టారాజ్యంగా రికార్డుల నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాల్సిన టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని రికార్డులు మాన్యువల్ కాగా, మరికొన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే రికార్డులు ఉన్నాయి. ప్రతీరోజు పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరు కాకపోయినా వందశాతం వచ్చినట్లు రికార్డుల్లో నమోదు చుయడం గమనార్హం. కేంద్రాలను తనిఖీ చేసేందుకు సూపర్‌వైజర్, మండలస్థాయి అధికారులైన మండల తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి రాకపోవడంతో కేంద్రాలలో టీచర్లు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తీరు నెలకొంది. పర్యవేక్షించేందుకు ఎవరు రారన్న గట్టి నమ్మకంతోనే అంగన్‌వాడీ టీచర్లు తప్పుగా రికార్డులలో నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీనికి తోడు అంగన్‌వాడీలకు రాజకీయ రంగు పులుముకుందన్న వాదనలు ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారాయి. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో, పలుకుబడితో కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించకుండా వస్తున్నామా, పోతున్నామా అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. చిన్నారుల బోధన సామర్థ్యం, పౌష్టికాహారంపై తల్లిదండ్రులు ప్రశ్నించే పరిస్థితి లేకుండా కేంద్రాలపై రాజకీయ నీలినీడలు అలుముకున్నాయి. ప్రశ్నించేవారు లేక తనిఖీలు చేసేవారు రాక అంగన్‌వాడీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను గాడిలో పెడతారో లేదో వేచి చూడాలి.



భక్తిశ్రద్ధలతో సంతమల్లన్నకు నైవేద్యాలు

● ఐదు రకాల ధాన్యాలతో వంటకం.. స్వామివారికి నైవేద్యం


అంక్సాపూర్‌లో సంతమల్లన్నకు ఐదు రకాల ధాన్యాలతో ఉడికిస్తున్న నైవేద్యాలు

వేల్పూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ సంతమల్లన్న జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేలాది మంది భక్తులు తరలివచ్చి సంతమల్లన్న దేవునికి నైవేద్యాలు సమర్పించారు. అంక్సాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు కూడా ఆరాధ్యదైవంగా నిలుస్తున్న సంతమల్లన్న ఈ ప్రాంత ప్రజలు గొప్ప పండుగగా భావిస్తారు. జాతర రోజుతోపాటు నైవేద్యాలు సమర్పించుకునే మంగళవారం రాత్రి వరకు గ్రామప్రజలు ప్రత్యేక నియామలతో ఉంటూ సంతమల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యవసాయ భూమిలో పండిన ఐదురకాల ధాన్యాలను ఒకేచోట వేసి వండిన వంటకాలతో నైవేద్యం వేసి సంతమల్లన్న దేవునికి మొక్కులు తీర్చుకున్నారు. ఇంటి కుటుంబసభ్యులు తలంటు స్నానాలు చేసి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆర్మూర్ డివిజన్ మండలాల గ్రామాల నుంచే కాకుండా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వాహనాలపై వేలాది మంది భక్తులు ఇక్కడికి చేరుకొని మల్లన్నకు నైవేద్యాలు ఎత్తుకొని గంటల తరబడి నిల్చొని నైవేద్యాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై నాగనాథ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు. ఈ ఉత్సవాలల్లో గ్రామ కమిటీ సభ్యులు, సంత మల్లన్న భక్తులు పాల్గొన్నారు.


అంక్సాపూర్ ఆలయంలో సంతమల్లన్నకు నైవేద్యాలు సమర్పించుకునేందుకు బారులు తీరిన భక్తులు

గ్రామ పంచాయతీ
కార్యదర్శులపై పనిభారం!

● సర్వే పనులతో సతమతం ● గ్రామ పంచాయతీ నిధులు రాక తప్పని అవస్థలు





ఆర్మూర్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి పథకంలో నడవాలన్నా, పచ్చదనం పరిశుభ్రతతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో గ్రామ పంచాయతీలదే బాధ్యత. వీటిని సక్రమంగా నెరవేర్చాల్సిన పంచాయతీ కార్యదర్శులకు పనిఒత్తిడి ఎక్కువవుతోంది. గ్రామ పంచాయతీలో ఉండే అరకొర నిధులతో నెట్టుకొస్తున్నారు. గ్రామ పంచాయతీలో ప్రజలతో సంబంధాలు ఎక్కువగా ఉంటాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది గ్రామ పంచాయతీ సిబ్బందే. దీనికి ప్రభుత్వం సర్వే పనులను పురామయించడంతో పనిభారం ఎక్కువవుతోంది. కుల గణన సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులలో పంచాయతీ కార్యదర్శులకు, కారోబార్‌లకు అప్పగించింది. దీంతో గ్రామాల్లో ఇంటి పనుల వసూలు కార్యక్రమం అటకెక్కింది.

● రోజువారీ కార్యక్రమాలతోనే బిజీబిజీ

పంచాయతీ కార్యదర్శులు రోజువారి పనులతో నిత్యం తీరిక లేకుండా ఉంటున్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా, వీధిదీపాలు, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, డ్రైనేజీల పూడికతీత, తదితర పనులతోపాటు ఇంటి పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉంది. వీరికి అదనపు పనులు అప్పగించడంతో ఇంటి పన్నుల వసూళ్లకు అంతరాయం కలుగుతుంది. ఇంటిపన్నులు వసూలు అయితేనే పారిశుధ్య కార్మికులకు, ఇతర సిబ్బందికి వేతనాలు చెల్లించేది. జీపీ సిబ్బందికి వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందులు పడాల్సివస్తోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

● గ్రామ పంచాయతీలకు రాని నిధులు

గతంలో గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వచ్చేవి. వాటితో పలు అభివృద్ధి పనులు చేపట్టేవారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిపోవడంతో గ్రామాల్లో పాలకవర్గం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కూడా ఇవ్వడం లేదు. గ్రామ పంచాయతీలు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. గత సంవత్సరం కాలంగా ఒక్కసారి మాత్రమే నిధులు వచ్చాయి. గ్రామ పంచాయతీలకు ఎంజీఎన్ఆర్, ఈజీఎస్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు వచ్చేవి. ప్రస్తుతం ఈ నిధులు రాకపోవడంతో జనరల్ ఫండ్‌ను వేతనాలకు, ఇతర వాటికి వినియోగిస్తున్నారు. ప్రతీనెల ఇంటి పన్నులు వసూలు చేసి ఎంతో కొంత సిబ్బందికి జీతాలు ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సిబ్బంది జీత భత్యాలతో పాటు వీధిదీపాలు, తాగునీటి సరఫరాకు వినియోగించే విద్యుత్ మోటార్ల బిల్లులను జీపీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిధులు విడుదలచేసినా అందులో అధికభారం విద్యుత్ బిల్లుల చెల్లింపునకే పోతోంది. గ్రామపంచాయతీల్లో నిధులు లేకున్నా ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిందే. దీంతో పంచాయతీ కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● ప్రభుత్వం ఎంపీడబ్ల్యుఎస్‌లకు నేరుగా వేతనాలు వేయాలి

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టిపర్పస్ వర్కర్స్ (ఎంపీడబ్ల్యుఎస్)లకు ప్రభుత్వం నేరుగా వేతనాలు అందజేస్తే గ్రామ పంచాయతీలకు భారం తగ్గుతోంది. పంచాయతీలలో కారోబార్, ఎలక్ట్రీషన్, ట్రాక్టర్ డ్రైవర్, వాటర్‌మెన్, పారిశుధ్య సిబ్బందికి వేతనాలను ప్రస్తుతం జీపీ జనరల్ ఫండ్ నుంచి చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల మల్టిపర్పస్ వర్కర్స్ డాటాను తీసుకుంది. వారి వేతనాలను వారి ఖాతాల్లోనే నేరుగా జమచేస్తే గ్రామ పంచాయతీలపై ఆర్థికభారం తగ్గుతోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగాలన్న, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీపీలకు నిధులు మంజూరు చేయాలి. అంతేగాకుండా గ్రామపంచాయతీలో పని చేసే పంచా యతీ కార్యదర్శులకు, ఇతర సిబ్బందికి అదనపు బాధ్యతలు కల్పించకుంటే ఉంటే వారు ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుంది.

టీయూ రిజిస్ట్రార్‌గా ప్రొ.యాదగిరి కొనసాగింపు

● రిజిస్ట్రార్ పదవి ముగింపుపై ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ● ఎట్టకేలకు రిజిస్ట్రార్ కొనసాగింపుతో ఉత్కంఠకు తెర

డిచ్‌పల్లి, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరిని కొనసాగిస్తూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.యాదగిరిరావు నియామక ఉత్తర్వులు మంగళవారం జారీచేశారు. రిజిస్ట్రార్ యాదగిరి పదవీకాలం ఈనెల 15తో ముగియడంతో వీసీ యాదగిరిరావు రిజిస్ట్రార్ యాదగిరి నే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రిజిస్ట్రార్ పదవి ముగింపుపై ఈ విషయంలో ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. దీంతో ఎట్టకేలకు వీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే రిజిస్ట్రార్‌గా యాదగిరి అత్యధిక కాలం కొనసాగడంపై అధ్యాపకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. యాదగిరి మరో 6నెలల్లో పది విరమణ ఉండటంతో రిజిస్ట్రార్‌గా కొనసాగేందుకు వీసీతోపాటు ఉన్నత విద్యామండలి అధికారుల వద్ద తనను కొనసాగించాలని కోరినట్లు తెలిసింది. వర్సిటీలో వివాదాస్పదంగా ఉన్న 2014 బ్యాచ్‌అధ్యాపకుల రిక్రూట్‌మెంట్ పదోన్నతులపై క్లియరెన్స్ ఇచ్చేందుకు హామీఇచ్చినట్లు వర్సిటీలో ప్రచారంజోరుగా సాగుతోంది. అయితే వర్సిటీలో అత్యధిక కాలంరిజిస్ట్రార్‌గా కొనసాగిన యాదగిరిని మరోమారు కొనసాగించడం, ఎంతోమంది సీనియర్ అధ్యాపకులు ఉన్నవారికి అవకాశం కల్పించకుండా యాదగిరినే కొనసాగించడంపై సర్వత్ర చర్చ జరుగుతుంది.

కరడ్‌పల్లి - మోతె రోడ్డుకు
మోక్షం కలిగేనా?

● తీవ్ర ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రయాణికులు ● విన్నవించినా పట్టించుకోని అధికారులు, నాయకులు
● కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా రోడ్డును బాగు చేయాలని గ్రామస్థుల వినతి

తాడ్వాయి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరడ్‌పల్లి - మోతె రోడ్డు అధ్వానంగా తయారైంది. రోజువారి పనుల నిమిత్తం రైతులు, ప్రయాణికులు రోడ్డుపై నడవాలంటే ఇబ్బందికరంగా తయారవుతోంది. 2006-07లో అప్పటి నిజామాబాద్ జిల్లా ఛైర్మన్ కాటిపల్లి వెంకట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మట్టి రోడ్డు వేయించారు..ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎందరో అధికారులు మారిన రోడ్డు పరిస్థితి మారడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష కాలంలో రోడ్డుపై నడవాలంటేనే ఇబ్బందికరంగా ఉందని పలువురు రైతులు చెప్తున్నారు. కరడ్‌పల్లి నుంచి మోతె గ్రామం మీదుగా ఎల్లారెడ్డి ప్రధాన రహదారి కలుస్తోంది. ఈ లింకు రోడ్డు చేయడంతో పలు గ్రామాలకు రాకపోకలు సులువుగా ఉంటాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. గత ప్రభుత్వంలో అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించిన ఫలితం లేకుండా పోయిందని రైతులు, గ్రామస్థులు అంటున్నారు. ప్రతీ సంవత్సరం గ్రామస్థులు అందరూ కలిసి ఎంతో కొంత డబ్బును పోగేసుకొని వర్షాకాలంలో మొరం వేయించుకుంటున్నామని అంటున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మోతే రోడ్డుకు మోక్షం లభిస్తుందని గ్రామస్థులు అనుకుంటున్నారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పట్టించుకోని కరడ్‌పల్లి - మోతే వరకు రోడ్డును నిర్మించి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



మొరం తేలి ఉన్న కరడ్‌పల్లి - మోతె రోడ్డు

రోడ్డుపై నడవడం ఇబ్బంది

● ఎల్మ సాయిరెడ్డి, రైతు



కరడ్‌పల్లి - మోతె రోడ్డుపై నడవడం చాలా ఇబ్బందికరంగా ఉంది. వర్షాకాలంలో అయితే నడవలేని పరిస్థితుల్లో ఉంటున్నాం. ప్రభుత్వం పట్టించుకుని రోడ్డును మంజూరు చేయించాలి.

డబ్బులు పోగు చేసి మొరం వేసుకుంటున్నాం


● చిట్యాల మైసయ్య, కరడ్‌పల్లి గ్రామస్థుడు



ప్రతీ ఏడాది వర్షాకాలంలో గ్రామస్థులంతా కలిసి తలా కొంత డబ్బును వేసుకుని రోడ్డుపై మొరం వేయించుకుంటున్నాం. ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకో లేదు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పట్టించుకోని రోడ్డును వేయించాలి.

సమస్యల పరిష్కార వేదికగా
వ్యవసాయ కమిషన్

● రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు గంగాధర్


మాట్లాడుతున్న గంగాధర్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరి ష్కారానికి వేదికగా వ్యవసాయ కమిషన్ పనిచేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రైతుల సంక్షేమం కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగా ధర్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి వేదిక లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమం కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. తనను సభ్యుడిగా నియమిం చినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయం, సాగునీరు, విత్తనాలు, ఎరువులు, గోదాములు, రైస్‌మిల్లులు, సొసైటీల ద్వారా రైతులు ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నా కమిషన్ దృష్టికి తీసుకురా వాలన్నారు. రాష్ట్రంలో రైతులను ప్రతిపక్షాలు పక్కదోవ పట్టిస్తున్నాయని రూపాయలు 2లక్షల రుణమాఫీ జరగని రైతులు ఏమైనా ఇబ్బందులు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. లగచర్లలో రైతుల ముసు గులో కలెక్టర్‌పై దాడి చేసిన వారిపట్ల ప్రభుత్వం కఠినంగా ఉంద న్నారు. రైతుల ముసుగులో కొంత మంది దాడి చేశారని వారికి కొన్ని పార్టీలు మద్దతు తెలపడం సరికాదన్నారు. రైతులకు సాగు నీటి కష్టాలను తీర్చేందుకు తిరిగి సాగునీటి సంఘాలను పునరుద్ధరించే ఆలోచన చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుసమన్వయ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయని వాటి వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆదర్శ రైతులను నియమించే ఆలోచన చేస్తున్నామన్నారు. ప్రతీ వెయ్యి ఎకరాలకు ఒక ఏఈవోలను నియమించే ఆలోచన ఉన్నట్లు ఆయన తెలిపారు.

మదర్ హుడ్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రగతినగర్‌లోగల మదర్ హుడ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశవేణు ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు బ్లడ్ బ్యాంక్‌లలో రక్తనిల్వల కొరత గుర్తించి వారి కొరకు ఈ రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు రియల్ హీరో జ్ఞాపికతో సన్మానించారు. దాదాపు 70 మంది రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తేజస్వి, డాక్టర్ రాజేష్‌లు మాట్లాడుతూ ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా ఎటువంటి ఆడంబరాలు లేకుండా తలసేమియా రోగులకు ఉపయోగపడే విధంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 18 ఏళ్ల నిండి 65 సంవత్సరాల్లోపు ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తదానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కరిపె అక్షయ్‌కుమార్, జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరిపె రవీందర్, రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు, గైని గంగారాం, తోట రాజశేఖర్, ఆకుల ప్రసాద్, భూమయ్య, మాస్టర్ శంకర్ పాల్గొన్నారు.

రెండో రోజు డీఎస్పీ ఆమరణ నిరాహార దీక్ష

సుభాష్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, ఉపాధి అందరికి అందించాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆమరణ నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుమన్ మహరాజ్, జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహరాజ్ ఆమరణ దీక్ష కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రేమ్‌కుమార్, జిల్లా నాయకులు మురళి, ప్రశాంత్, సుభాష్, మహిపాల్, కిషన్, ఉమేష్, మహేష్, నిశాంత్, గంగాధర్, మహేష్, అజయ్, ఆత్మగౌరవ్, బాలన్న, తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలుపై సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ డిమాం డ్లను నెరవేర్చాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌లో సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం 11వ రోజు ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు పదిరోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఇకనైనా తమను క్రమబద్ధీకరించాలని కోరారు. గత 20 ఏళ్లుగా సమగ్ర శిక్షాలో తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని అయినప్పటికీ ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్, విజయ్, గంగామణి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.


నగరంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


మోపాల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం..

లగచర్ల రైతుల అరెస్టు రాజ్యాంగ విరుద్ధం

సుభాష్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతుల అక్రమ అరెస్టులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధమని నగర పాలక సంస్థ మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాచరిక పాలన సాగిస్తుందన్నారు. అమాయక గిరిజన దళిత రైతుల భూముల ను అక్రమంగా లాక్కొని ముఖ్యమంత్రి అల్లుడికి అప్పగించడానికి చూ స్తుందన్నారు. అనంతరం జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ మా ట్లాడుతూ.. అడుగడుగునా రాజ్యాంగానికి విరుద్ధంగా కాంగ్రెస్ వ్యవహ రిస్తుందన్నారు. కార్యక్రమంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, కరిపెరాజు, తడకల్ శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, అగ్గు సంతోష్, గాండ్ల లింగం, నీల గిరిరాజు, అరవింద్ సింగ్, చింతకాయల రాజు పాల్గొన్నారు.

మోపాల్: కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైల్లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఇందులో పార్టీ నాయకులు, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, పార్టీ అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. అలాగే రూరల్ మండలంలోని మల్లారం, ఆకుల కొండూర్ గ్రామాల్లో అంబే ద్కర్ విగ్రహాలకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ధర్పల్లి: లగచర్ల ఘటనలో రైతులకు బేడీలు వేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోగల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రైతులపై కేసులు పెట్టి వారికి బేడీలు వేయడాన్ని నిరసిస్తూ అంబేద్క ర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్లసారిక హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహి పాల్ యాదవ్, మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు రాజ్‌పాల్ రెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ కిశోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులపే ఎత్తి వేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేష్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ అంజయ్య, పాశంకుమార్, శ్రీనివాస్, రఘు, సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: లగచర్ల రైతులపై అక్రమ అరెస్టులు, థర్డ్ డిగ్రీ ప్రయోగిం చడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శక్కరి కొండ కృష్ణ, పార్టీ నాయకులు లక్ష్మీనర్సయ్య, ఒడ్డం నర్సయ్య, లింగం యాదవ్, యూసుఫ్, గిరి, రవి, గంగాధర్, బుచ్చమ్మ, గీత, యశోద, పాల్గొన్నారు.

సిరికొండ: లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు నారవోయిన శ్రీనివాస్, నాయకులు ఆకుల తిర్మల్, సంతోష్‌రెడ్డి, అన్వార్, సిరికొండ మాజీ సర్పంచ్ ఎన్నం రాజరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తోట రాజన్న తదితరులు పాల్గొన్నారు.


బాలభవన్‌లో చెస్ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడలు

సుభాష్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో మంగళవారం హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ క్రీడలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రీడలు జరిగాయి. నగరంలోని బాల్‌భవన్‌లో చెస్ పోటీలు జరిగాయి. సు మారు వందకు పైగా క్రీడాకారులు చెస్ పోటీలో తమ ప్రతిభను చా టేందుకు పోటీలో పాల్గొన్నారు. మొదటి విజేతగా నాల్గవ తరగతి చ దువుతున్న అభిజిత్ నిలిచాడు. రెండవ విజేతగా రవివర్మ, బాలికల విభాగంలో రుశిత మొదటి విజేత కాగా, రెండో విజేతగా శివత్న నిలి చింది. వీటితోపాటు వెయిట్ లిఫ్టింగ్ క్రీడలు జరిగాయి.

ఉద్యోగ విరమణ పొందిన వారి సంక్షేమం ప్రభుత్వ బాధ్యత


వృద్ధులను సన్మానిస్తున్న గ్రంథాలయ చైర్మన్, అదనపు కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగి తన ముఖ్యమైన కాలాన్ని, వయస్సును ప్రభుత్వ సేవ, ప్రజల కోసం అం కితం చేశారని వారి తదుపరి జీవితం సవ్యంగా సాగిపోయేలా చూ డటం ప్రభుత్వ బాధ్యత అని గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజా రెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్‌లు అన్నారు. మంగళవారం తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూ అంబేద్కర్ భవన్‌లో జాతీయ పెన్షన్ డే కార్యక్రమాన్ని నిర్వ హించారు. పెన్షనర్స్ జాతీయ నాయకురాలు సంయుక్త, జిల్లా అధ్య క్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ఈ పెన్షన్ హక్కు మన పూర్వీకులు సాధించారని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. మధుసూదన్, ఈవీఎల్ నారాయణ, హన్మాండ్లు, ప్రసాద్‌రావు, కృష్ణారావు, భోజారావు, లక్ష్మీనారాయణ, సిర్పలింగం పాల్గొన్నారు.

దుబాయ్‌లో గాయపడ్డ వారికి సహాయ చర్యలు చేపట్టాలి : ఎంపీ

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో బస్సు ప్రమాదంలో గాయపడ్డ వారికి సహాయ చర్యలు చేపట్టాలని ఎంపీ అర్వింద్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన విదేశాంగ మంత్రి జయశంకర్‌కు లేఖ రాశారు. దుబాయ్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన వారిలో నిజామాబాద్ పార్లమెంట్‌కు సంబంధించిన వారు ఉన్నారని ఆయన తెలిపారు. వారిని జిల్లాకు వచ్చే విధంగా సహాయచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించని హోటళ్ల నిర్వాహకులపై కేసులు

ఖిల్లా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి వరకు దుకాణాలు, హోటళ్లను తెరిచి ఉంచిన వారిపై ఒకటో టౌన్ పోలీసుల కేసులు నమోదు చేశారు. నిజామాబాద్ ఏసీపీ ఎల్. రాజవెంకటరెడ్డి అర్ధరాత్రి వేళ నగరంలో పర్యటించి హోటళ్ల నిర్వాహ కులకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి వేళ హోటళ్లను తెరచి ఉంచిన ముగ్గురు వ్యక్తులను ఒకటో టౌన్ పోలీసులు అదుపులోకి తీ సుకుని వారిపై కేసులు నమోదు చేశారు. వీరిలో నెహ్రూపార్క్ వద్ద గల ఒలంపియా బేకరీని తెరచి ఉంచి వ్యాపారాలు జరుపుతున్న షేక్ అమాన్‌ను, రైల్వే స్టేషన్ వద్ద గల స్టార్‌హోటల్ నిర్వాహకుడు షేక్ అస్లంను, న్యూపారడైజ్ హోటల్‌ను అర్ధరాత్రి వరకు తెరచి ఉంచిన హోటల్ వర్కర్ అత్నూర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరికి మంగ ళవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జ హాన్ ఎదుట హాజరు పర్చగా షేక్ అమాన్‌కు రెండు రోజుల జైలు శిక్ష, అస్లాం, అత్నూర్‌లకు ఒక్కొక్క రోజు జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

తెలుగు సాహిత్యంలో వాడి గ్రామవాసికి డాక్టరేట్

వేల్పూర్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో చేసిన పరిశోధనలకు గాను వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన సుంకరి గంగాధర్ డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సిద్దంత గ్రంథంలో చేసిన పరిశోధనకు గంగాధర్‌కు డాక్టరేట్ రావడం హర్షనీయమని ప్రముఖకవి కొరవీ గోపరాజ్, సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు కంకరణాల రాజేశ్వర్ అన్నారు. గంగాధర్ నిజామాబాద్ ప్రాచీన చరిత్ర కలిగిన సారంగపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయంలో తెలంగాణ సాంస్కృతి, కవిత్వం, సమగ్ర పరిశీలన అనే అంశంపై సిద్దంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ గ్రంథానికి డాక్టరేట్ పట్టా ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటించింది. సుప్రసిద్ధ కవి, పరిశోధకుడు డాక్టర్ నాళేశ్వరం శంకర్, సుంకరి గంగాధర్ పరిశోధనకు పర్యవేక్షకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకరశర్మ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చింతకింది కాశీం, తెలంగాణ రచయితీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణపురం దేవేందర్, డాక్టర్ రఘు, ఆచార్య వారజారణి, డాక్టర్ సల్ల సత్యనారాయణ, డి.గోపాల్, డాక్టర్ బాగ్యలక్ష్మీ, తదితరులు గంగాధర్‌ను అభినందించారు. తమ గంగాధర్ డాక్టరేట్ పొందడం పట్ల వాడి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఐ(ఎంఎల్) నాయకుల ముందస్తు అరెస్టు

సిరికొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికు సమస్యల పరిష్కారం కోసం 'చలో హైదరాబాద్'కు వెళ్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, టీయూ సీఐ కార్మిక సంఘం నాయకులను సిరికొండ పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చి అరెస్టులు చేయడమేమిటని టీయూసీఐ జిల్లా నాయకులు ఆర్.రమేష్ అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, డివిజన్ నాయకులు పాయరెడ్డి టీయూసీఐ జిల్లా నయకులు రమేష్, రాములు, రాజన్న, లింగం, దాస్‌లు ఉన్నారు.

డిచ్‌పల్లి: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నిల బెట్టుకోవడంలో విఫలమైందని కార్మికులు తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమిస్తుంటే అక్రమ అరెస్టులు చేయడం సిగ్గు చేటు అని టీయూసీఐ వెంకన్న విమర్శించారు. మంగళవారం పంచాయతీ కార్మికులు చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా వారిని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మోహన్, రాజేందర్, మురళి, రాము, గంగాధర్, శంకుతల, ఖాజా, పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మోపాల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన ముద్రబోయిన సాయికుమార్ (డయాలసిస్ పేషెంట్)కు మంగళవారం 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పంపించిన చెక్కును గ్రామ పెద్దలు రవికుమార్, నడిపి గంగాధర్, అన్నంగోపి, దశరథ్‌యాదవ్, శేఖర్, భూమేష్, నర్సయ్య, ప్రవీణ్‌లు అందజేశారు.

గుండె పోటుతో తండ్రి మృతి
నిలిచిన తనయుడి వివాహం

డిచ్‌పల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండంలోని నడిపల్లికి చెందిన కర్రోళ్ల రాజన్న (58) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ నెల 20 రాజన్న కుమారుడి వివాహం ఉండగా.. తండ్రి మృతి చెందారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజన్న చాలా ఏళ్లు గల్ఫ్‌లో పనిచేసి తిరిగి వచ్చి ఆర్యనగర్‌లో ఉంటున్నారు. ఏడాదిక్రితం తన కుతూరు వివాహం చేశారు. గుండె పోటుతో తండ్రి మృతితో కుమారుడి వివాహం నిలిచిపోయింది.

పోలీసు కమిషనర్ నియామకం ఎప్పుడు?

(ఐదో పేజీ తరువాయి)

కన్‌ఫర్డ్ ఐపీఎస్‌ను నియమించాలని కోరారు. ఎవరికి వారే తమకు అనుకూలమైన అధికారులను సీపీగా నియమించాలని కోరారు. ఆయనకే ఇన్‌చార్జి డీఐజీగా బాధ్యతలు అప్పచెప్పాలని విన్నవించారు. ఒకవర్గం రెగ్యులర్ ఐపీఎస్‌కు పట్టుబడుతుండగా మరొక వర్గం పదోన్నతి పొందిన ఐపీఎస్‌ల వైపు మొగ్గు చూపుతుండడంతో ప్రభుత్వం నియామకం వాయిదా వేసింది. రాష్ట్రస్థాయిలో జరిగే ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నియామకం చేపట్టేందుకు సిద్ధమైంది. గతంలో గ్రూప్-1 అధికారిగా ఎంపికై డీఎస్పీగా, అదనపు ఎస్పీగా చేసి నాన్ క్యాడర్ ఎస్పీ నుంచి ఐపీఎస్ పదోన్నతులు పొందిన అధికారులు ఎక్కువ మంది జిల్లాకు సీపీగా వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పనిచేసిన సమయంలో నేతలతో ఉన్న సంబంధాలతో ఇక్కడికి వచ్చేందుకు గట్టి ప్రయత్నాలను చేశారు. రెగ్యులర్ ఐపీఎస్‌లను నియమిస్తే తమకు అనుకూలంగా ఉండరని ఒకవర్గం నేతలు పట్టుబడుతుండటంతో నియామకం వాయిదా పడుతున్నట్లు తెలుస్తోంది.

త్వరగా సీపీని నియమించాలి

రాష్ట్రంలో నిజామాబాద్ సున్నితమైన జిల్లా కావడం వివిధ అంశాలపై దృష్టి సారించవల్సి ఉండటంతో త్వరగా సీపీని నియమించాలని పలువురు సంఘాల నేతలు కోరుతున్నారు. గతంలో పలు సందర్భాల్లో శాంతిభద్రతల సమస్యలు ఎదురైన పరిస్థితులు ఉన్నందున ఎక్కువ రోజులు ఖాళీగా ఉంచకుండా పనిచేసే అధికారులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో నియామకం ఆలస్యం కావడం వల్ల ఆ ప్రభావం జిల్లాపై పడుతోంది. కమిషనర్ లేకపోవడంతో కొన్ని అంశాలపైన కిందిస్థాయి అధికారులు దృష్టి పెట్టడం లేదు. గతంలో వివిధ పండుగల సమయంలో ఆందోళనలు, గొడవలు జరిగాయి. ప్రస్తుతం శాంతిభద్రతల సమస్యలకు ఇబ్బందులు లేకున్నా రెండు నెలలు సీపీ లేకపోవడం వల్ల ఆ ప్రభావం జిల్లాపై కనిపిస్తోంది. జిల్లాకు సీపీతో పాటు లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ కూడా లేకపోవడం వల్ల శాంతి భద్రతల పర్యవేక్షణ కరువవుతోంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకొని త్వరగా సీపీని నియమించాలని పలు సంఘాలు, పలువురు నేతలు కోరుతున్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాల తర్వాత జిల్లాకు నూతన సీపీని నియమించే అవకాశం ఉందని అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది.

పెట్రోల్ బంక్ అక్రమాలను అరికట్టాలి

● పెట్రోల్ పంప్ వద్ద నగర పాలక సంస్థ డ్రైవర్ల ఆందోళన

సుభాష్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టి మున్సిపల్ డ్రైవర్లకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని నగర శివారులో గల పెట్రోల్ బంక్ ఎదుట డ్రైవర్లతో కలిసి ఆందోళన నిర్వ హిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర పాలక సంస్థలో పనిచేసే శానిటేషన్ డ్రైవర్లకు పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ తక్కువగా పోయడంతో మున్సిపల్ డ్రైవర్లే 50 రూపాయలు అదనంగా పెట్రోల్, డీజిల్ పోయించుకోవాల్సి వస్తుందన్నారు. మున్సిపల్ అధి కారులు ఇచ్చిన కూపన్లకు అనుగుణంగా పెట్రోల్ బంక్ యజమానులు ఇంధనం పోయకపోవడంతో డ్రైవర్లు తమ జేబుల నుంచి డబ్బులు పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్‌పై అధికారులు దృష్టి సారించాలన్నారు. రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్ సిబ్బందికి పెంచిన వేతనాలు నగర పాలక సంస్థ పరిధిలో పనిచేసే డ్రైవర్లకు వాటర్ వర్క్ సిబ్బందికి అమలు చేయడం లేదని అన్నారు. చనిపోయిన కార్మికుల అంత్యక్రియలకు కూడా ఖర్చులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్క రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డ్రైవర్ల నాయకులు లక్ష్మణ్, సంతోష్‌గౌడ్, ఏకనాథ్, గంగాశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వచ్చేనెల 5వ తేదీన నిర్వహించే సావిత్రిబాయి పూలే పురస్కారాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో అశోక్ కరపత్రాలను ఆవిష్కరించారు. సావిత్రిబాయిపూలే గొప్ప సంఘసంస్కర్త అని భారతదేశ చరిత్రలోనే స్త్రీ విద్యను ప్రవేశపెట్టిన ఘనత ఆమె దన్నారు. ప్రతీ సంవత్సరం సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాళ్లకు పురస్కారాలు అందజేయడం గొప్ప విష యమన్నారు. ఈ కార్యక్రమంలో బిసిటియు జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, రామకృష్ణ, పిఆర్‌టియు అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, డిసిఈబి కార్యదర్శి సీతయ్య పాల్గొన్నారు.

యువకుడి మృతిపై పోలీసుల విచారణ

ఖిల్లా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఒకటో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా మృతి చెందిన చంద్రకాంత్‌పై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సోమవారం ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు పలువురిని విచారిస్తు న్నట్లు తెలిసింది. రెండు రోజుల కితం ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదంలో హమాలీ పని చేసుకుంటున్న చంద్రకాంత్‌పై మిర్చికాంపౌండ్‌కు చెందిన కొందరు దాడి చేసి హత్య చేసి ఉంటారని మృతుడి కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున పోలీసు స్టేషన్‌కు తరలివె ళ్లారు. తమకు న్యాయం చేయాలని దాడిచేసిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసు లకు విన్నవించినట్లు సమా చారం. ఒకటో టౌన్ ఎస్‌హె చ్‌వో రఘుపతి సిబ్బందితో ప లువురిని పోలీసు స్టేషన్‌కు పిలచి విచారణ ముమ్మరం చేస్తున్నారు.